దేశంలో ముస్లింల స్థితిగతులు... విశ్లేషణ

దేశ జనాభాలో 13.4 శాతం ముస్లింలు. వెనుకబడిన తరగతుల జనాభాలో వీరిది 15.7 శాతం. ముస్లింలు ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు (36 శాతం); దేశ జనాభాలో 28 శాతం మాత్రమే పట్టణీకరణ చెందింది. ముస్లింలు ఎక్కువగా ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో ఉన్నారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కంటే వీరి జీవన ప్రమాణం అంత మెరుగైంది ఏమీ కాదు. వీరి సంక్షేమం కోసం ప్రభుత్వం అవలంబి స్తున్న విధానాలు అంత ఆశాజనకంగా లేవు.

సమసమాజ స్థాపన కోసం గత 60 ఏళ్లుగా కుల ప్రాతిపదికన ప్రభుత్వ ఉద్యోగాల్లో, విద్యారంగంలో రిజర్వేషన్ సౌకర్యం అమల్లో ఉంది. ఈ ఫలితాలు అనుభవించేవారు ఈ విధానాన్ని సమర్థిస్తుండగా.. మిగిలిన వారు వ్యతిరేకిస్తున్నారు. కుల వ్యవస్థ వల్ల వివక్షకు గురవుతున్న వారికి రిజర్వేషన్ల వల్ల సామాజిక హోదాలో పెద్ద మార్పేమి కలగలేదని కొందరు భావిస్తే.. రిజర్వేషన్ విధానం కులతత్వాన్ని మరింత పెంపొందించిందని మరికొందరి అభిప్రాయం. ఈశాన్య సరిహద్దు రాష్ట్రాల్లో స్థానికులకు, 'విదేశీయుల'కు మధ్య జాతిపరంగా అంతరాలు పెరగడానికి రిజర్వేషన్ వివాదమే కారణం. ఈ అంశం సమానత్వం, సామాజిక న్యాయం, జాతీయసమగ్రతా భావాలను ప్రభావితం చేస్తుంది. ఇటీవల కాలంలో ప్రభుత్వం ఈ విషయాల్లో చూపుతున్న చొరవ అభిలషణీయమైనప్పటికీ సమాజంలోని కొన్ని వర్గాలు అసలు రిజర్వేషన్ విధానాన్నే వ్యతిరేకిస్తున్నాయి. సామాజిక న్యాయాన్ని సాగించటానికి ప్రస్తుతం కొనసాగిస్తున్న రిజర్వేషన్లతో పాటు వివక్షా వ్యతిరేక విధానాన్ని కూడా అనుసరించాలి. 2006లో న్యాయమూర్తి రాజేందర్ సచార్ కమిటీ.. భారతదేశంలో సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో ముస్లింల స్థితికి సంబంధించి నివేదికను సమర్పించింది. ఇది ప్రధానంగా సమాజంలో అణగారిన వర్గాలను ఉద్దేశించి రెండు ముఖ్య సిఫారసులు చేసింది.

- అణగారిన వర్గాల క్లేశ నివారణ కోసం సమాన అవకాశాల కమిషన్ ఏర్పాటు చేయటం.
- అన్ని రంగాల్లో వైవిధ్యాన్ని ప్రోత్సహించటానికి కొన్ని ప్రేరణలు కలిగించటం.

సచార్ కమిటీ సిఫార్సులను మరింత విస్తృతంగా అధ్యయనం చేయటానికి మీనన్ కమిటీ (సమాన అవకాశాల కమిషన్ పరిశీలనకు), అమితాబ్ ఖుందూ కమిటీ (వైవిధ్య సూచికలను రూపొందించటానికి)లను నియమించారు. ఈ రెండు కమిటీలు సమర్పించిన నివేదికలతోపాటు ప్రధానమంత్రి కార్యాలయంలోని ప్రధాన కార్యదర్శి టి.కె.ఎ. నాయర్ ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ సదుపాయానికి సంబంధించిన విషయాలను సమన్వయపరుస్తారు. మీనన్ కమిటీ సిఫార్సు చేసిన సమాన అవకాశాల కమిషన్ ముఖ్య ఉద్దేశం.. సమాజంలో కుల, మత, భాషాపరంగా జన్మస్థల, లింగ, జాతి ప్రాతిపదికగా వివక్షకు గురవుతున్నవారికి రక్షణ కల్పించటానికి ఏయే సదుపాయాలు కల్పించాలో పరిశీలిస్తుంది. ప్రభుత్వరంగంలో కొనసాగుతున్న వివక్షతో పాటు గృహరంగంలో కొనసాగుతున్న వివక్షను కూడా పరిశీలిస్తుంది.

సచార్ కమిటీ సేకరించిన సమాచార విశ్లేషణలో విదితమైన అంశాలు:

- వాస్తవానికి ప్రభుత్వ విధానాల వల్ల వీరికి లభిస్తున్న ఊరట అంతంతమాత్రమే. ఉపాధి, గృహ, విద్యారంగాల్లో వీరు మరింత వివక్షకు గురవుతున్నారు. లింగ పరమైన వివక్షను 'ముస్లిం పర్సనల్ లా'తో ముడిపెడుతున్నారు. మిగిలిన మహిళల కంటే ముస్లిం మహిళలు, విద్యా, ఉపాధి రంగంలో మరీ ఎక్కువ వివక్షకు గురవుతున్నారు. వారి వెనుక బాటుతనానికి పర్సనల్ లా, సామాజిక, సాంస్కృతిక తేడాలు ప్రధాన కారణాలని సగటు పౌరుడు భావిస్తున్నాడు. వారి వెనుక బాటుతనానికి ముస్లిం సమాజాన్ని నిందిస్తున్నారు.
- మతపరమైన అల్లర్లు జరిగే ప్రాంతాల్లో నివసించే ముస్లింల్లో అభద్రతా భావం ఎక్కువ. పోలీస్ వ్యవస్థ అనుసరించే వివక్షా ధోరణి దీనిని మరింత ఎక్కువ చేస్తుంది. ఈ వర్గానికి చెందిన వారు వీలైనంతవరకు ఒకేచోట నివసించాలని కోరుకోవడం వల్ల విస్తృతంగా లభిస్తున్న ఆర్థికావ కాశాలను ఉపయోగించుకోలేక పోతున్నారు.
- విద్యారంగంలో వెనుకబాటుతనం ఈ సమాజాన్ని మరింత కుంగదీస్తుంది. మాతృభాషలో విద్యావకాశాలు అంతంత మాత్రంగానే ఉండటం, పాఠ్యగ్రంథాల్లో ఈ వర్గాన్ని జాతి వ్యతిరేక వర్గంగా చిత్రించడం లాంటి అంశాలు వీరిలో మిగిలిన సమాజం పట్ల వ్యతిరేకత, నిరాశావాదానికి దారితీస్తున్నాయి.
- మదర్సాలలో లభిస్తున్న విద్యావకాశాలు ఉపాధికి దోహదం చేయడం లేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉద్యోగావకాశాలు తగ్గడం ఈ వర్గాన్ని మరింత దెబ్బతీసింది. వీరు ఎక్కువగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. చేతివృత్తుల మీద ఆధారపడే వీరు విదేశాల నుంచి చౌకగా దిగుమతి అవుతున్న వస్తువుల పోటీకి తట్టుకోలేకపోతున్నారు.
- బ్యాంకుల ద్వారా వీరికి లభించే రుణ సదుపాయాలు అంతంత మాత్రమే. ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రదేశాలను బ్యాంకులు 'రెడ్ జోన్'గా పరిగణిస్తాయి.
- ప్రభుత్వం కల్పించే మౌలిక సదుపాయాల విషయంలో వీరు మరింత వివక్షకు గురవుతున్నారు. వీరు నివసించే ప్రాంతంలో రోడ్లు, నీటి సరఫరా, విద్యుచ్ఛక్తి, డ్రైనేజీ, పాఠశాలలు, రవాణా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. వీటికితోడు రాజకీయ భాగస్వామ్యంలో కూడా వీరు వెనుకబడి ఉన్నారు. ఓటర్ల జాబితాలో వీరి పేర్లు గల్లంతవడం, వీరి జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ కులాలకు రిజర్వు చేయడంలాంటి చర్యలు వీరిలో మరింత నిర్లిప్తతా ధోరణికి దోహదం చేస్తున్నా యి. ఇది పరాయీకరణకు దోహదం చేస్తోంది. దీన్ని ఆసరాగా తీసుకొని మత ఛాందస సంస్థలు యువతను తమవైపు తిప్పు కోవడానికి ప్రయత్నించడం, కొన్ని సందర్భాల్లో ముస్లిం యువత అతివాదం, ఉగ్రవాదం వైపు ఆకర్షితులు కావడం జరుగుతోంది.

విధానపరమైన చొరవలు:

విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఈ వర్గానికి రిజర్వేషన్ సదుపాయాలు కల్పించే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. మత ప్రాతిపదికన రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం వివాదాస్పద మౌతుంది. ఆర్థిక, సామాజిక హోదా ప్రాతిపదికగా రిజర్వేషన్ సదుపాయం కల్పించడం అవసరం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ సదుపాయం కల్పించింది. ఈ వర్గానికి ప్రత్యేకంగా (షెడ్యూల్డ్ కులాలు, తెగల మాదిరిగా) సంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించడం సబబేమో. చాలా సందర్భాల్లో కార్యక్రమాల అమల్లో చిత్తశుద్ధి లోపిస్తుంది. ఈ సామాజిక వర్గ ప్రజల చొరవ అవసరం. వక్ఫ్ ఆస్తులను, జకాత్ వనరులను ఈ వర్గ ప్రగతి కోసం వినియోగించాలి. రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించడానికి చర్యలు చేపట్టాలి.

సచార్ కమిటీ సూచించినట్లు..

- సామాజిక, మతపరమైన వర్గాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని సేకరించడం, సంక్షేమ కార్యక్రమాలను ఈ సమాచార ప్రాతిపదికగా రూపొందించడం.
- బ్రిటన్‌లో మాదిరిగా సమాన అవకాశాల కమిషన్‌ను ఏర్పాటు చేయడం.
- స్థానిక సంస్థల్లో నామినేషన్ ద్వారా ప్రాతినిధ్యం కల్పించడం (ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో చొరవ తీసికొంది.).
- వైవిధ్యాన్ని ప్రోత్సహించే విద్యా సంస్థలకు ప్రోత్సాహకాలివ్వడం.
- ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో మరిన్ని పాఠశాలలు నెలకొల్పి మాతృభాషలో ప్రాథమిక విద్యను బోధించడం.
- బ్యాంకింగ్, ప్రభుత్వ రంగాల్లో లభించే ఉద్యోగవకాశాలను వినియోగించుకోవడానికి ఉచిత శిక్షణా సంస్థలను నెలకొల్పడం.
- పోలీస్, సైన్యం వంటి రంగాల్లో వీరి శాతాన్ని పెంచడానికి కృషి చేయడం.
- స్వశక్తి సముదాయాల ద్వారా ముస్లిం స్త్రీలకు పరపతి సౌకర్యాలు విస్తృతం చేయడం.
- ఉద్యోగాల నియామక కమిటీల్లో ఈ వర్గానికి ప్రాతినిధ్యం కల్పించడం.
- ఈ వర్గం నివసించే ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం.
- వీరు నివసించే ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పడం లాంటి చర్యలు చేపడితే సమసమాజ నినాదాన్ని ఆచరించినట్లవుతుంది.

భారతదేశం త్వరితగతిన అభివృద్ధి చెందుతోంది. అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలి. సమతౌల్యతలోపిస్తే.. అభివృద్ధి దేశ మనుగడకే సవాలుగా పరిణమిస్తుంది. నిరుద్యోగం, నిరక్షరాస్యత, పేదరికం ఈ వర్గాన్ని పీడిస్తున్నాయి. వీటి నుంచి విముక్తి లభించినప్పుడే వారిలో అభద్రతాభావం తొలగిపోతుంది. అదే దేశానికి పెద్ద భద్రత.